

మిర్చిసాగులో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మిర్చి సాగుచేసే రైతులకు గ్రామాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఈ వాణిజ్య పంట సాగు ద్వారా భారీ పెట్టుబడితో కష్టపడి పండించి అధిక ఉత్పత్తి చేస్తే అదేస్థాయిలో లాభాలు చూసిన రైతన్న గత రెండేళ్లుగా నష్టాలు మూటగట్టుకుంటున్నాడు. తామరపురుగు వంటి చీడపీడలు విజృంభించడంతో దిగుబడులు దారుణంగా పడిపోయి రైతుల అప్పులపాలయ్యారు. ఈ క్రమంలో మిర్చిసాగంటే రైతులు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ సంవత్సరం మిర్చి నాట్ల సీజన్ ప్రారంభమైనా తోటలు వేసే విషయంలో చాలా మంది రైతులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.



అమ్మో మిర్చి

మిరప పంటపై ఏటా విజృంభిస్తున్న తెగుళ్లు

- వాతావరణ అసమతౌల్యంతో దెబ్బతింటున్న తోటలు
- పలుచోట్ల రైతులను ముంచుతున్న నకిలీ విత్తనాలు
- తడిసి మోపెడవుతున్న పెట్టుబడులు
- సీజన్‌లోనూ రైతులకు దక్కని గిట్టుబాటు ధర
- ఏసీ మిర్చీ ధరలూ నేలచూపే
- ఈ ఏడాది సాగు లక్ష్యం చేరేనా?

ఖమ్మం, జూలై 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో మిర్చిసాగుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం లక్షన్నర ఎకరాలపైగా ఏటా మిర్చిసాగవుతుంది. ఎకరానికి లక్షనుంచి రూ.లక్షా 50వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేసే దిగుబడులు సక్రమంగా ఉండి మార్కెట్‌లో ధర అనుకూలంగా ఉంటే రైతులుకు లాభాలు వస్తాయి. అదే పరిస్థితులు అనుకూలించక దిగుబడులు పడిపోతే భారీగా నష్టాలు మూటగట్టుకోవాల్సిందే.. గత రెండేళ్ల వరకు మిర్చి సాగు చేసిన రైతులు ఎకరానికి 25నుంచి 30క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించి క్వింటాకు రూ.15వేల ధరతోనే ఎకరానికి రూ.లక్ష వరకు లాభాలు చూశారు. దీంతో చిన్న, మధ్యతరగతి రైతులు కనీసం 5నుంచి 10 ఎకరాలు, పెద్ద రైతులు 20నుంచి 30 ఎకరాల వరకు ఉమ్మడి జిల్లాలో మిర్చిసాగు చేస్తూ వస్తున్నారు. భద్రాచలం ఏజెన్సీలో మిర్చి సాగును కార్పొరేట్ వ్యవసాయంలా ఎక్కువ స్థాయిలో సాగు చేసే రైతులు అధికంగా ఉన్నారు. గత రెండేళ్ల వరకు మిర్చి రైతులు హైబ్రిడ్ వంగడాలతో అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందగా తామర పురుగు వ్యాప్తి జరిగిన తర్వాత చాలామంది రైతులకు పెట్టుబడులు కూడా రాని దుస్థితి నెలకొందవి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో తామరపురుగు విపరీతంగా విజృంభించడంతో ఎకరానికి రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే సాధించారు. దీంతో మిర్చికోత కూలీ కూడా రైతులకు దక్కలేదు. అనేకమంది రైతులు ఎకరానికి రూ.లక్షకు పైగా నష్టపోయారు. గత ఏడాది తామర పురుగు ఉండదన్న నమ్మకంతో మిర్చి సాగు చేసినా తామరపురుగుతో పాటు ఇతర తెగుళ్లు విజృంభించి రైతును దారుణంగా దెబ్బతీశాయి. అనేకమంది రైతులు మొక్కల దశలోనే తమ తోటలను తొలగించారు. ధైర్యం చేసి సాగుచేసిన రైతులకు కొన్నిచోట్ల ఎకరానికి 5నుంచి 10క్వింటాళ్ల దిగుడులు రాగ మరి కొన్ని చోట్ల అసలు దిగుబడి లేక ఆయా రైతులు తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక దారుణంగా దెబ్బతిన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో నకిలీ మిర్చి విత్తనాలు సైతు పలుచోట్ల రైతులను దెబ్బ తీశాయి. ఆయా విత్తనాలను సాగు చేసిన తోటల్లో పూత, కాత లేక రైతులు తమ తోటలను తొలగించి మొక్కవంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేశారు.

తాజాగా ఈ ఏడాది మిర్చి నాట్ల సీజన్ ప్రారంభమైంది. అయితే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని చాలామంది రైతులు రైతులు మిర్చి పంట వేయాలంటేనే ఒకటిరెండుసార్లు ఆలోచిస్తున్నారు. మళ్లీ తామరపురుగు ఎక్కడ దాడి చేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్, సుబాబుల్, జామియిల్, పత్తి, మొక్కజొన్న, కూరగాయల సాగుపై దృష్టిసారిస్తున్నారు. ఉద్యానవనశాఖ ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో లక్షన్నర ఎకరాల వరకు మిర్చి సాగు లక్ష్యంగా పెట్టుకున్నా లక్ష ఎకరాలోపే తోటలు వేసే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఏడాది మిర్చి విత్తనాలు, నారుమళ్లకు డిమాండ్ తగ్గింది. గతంలో మిర్చి సీజన్ వస్తుందంటే మార్కెట్‌లో పలు రకాల మిర్చి విత్తనాలకు విపరీతమైన డిమాండ్ ఉండేది. కొన్ని రకాల విత్తనాలు బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించారు. కొందరు ఇతర ప్రాంతాల నుంచి దొంగచాటుగా తెచ్చి విక్రయించేవారు. కానీ ప్రస్తుతం ఉన్న విత్తనాలతోనే రైతులు సరిపెట్టుకునే పరిస్థితతులు కనిపిస్తున్నాయి. ముందుగా భారీగా పెట్టుబడి పెట్టి పంట కాత, పూత దశలో తామరపురుగు విచ్చలవిడిగా విజృంభిస్తున్నందున రైతులు దాన్ని అరికట్టలేక చేతులెత్తేస్తున్నారు. శాస్త్రవేత్తలు సూచనల మేరకు పలురకాల మందులను పిచికారి చేసినా తామరపురుగు తాకిడిని మాత్రం అడ్డుకోలేకపోతున్నారు. పంట మార్పిడి ద్వారా తామర పురుగు నివారణ సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు అధికారులు చెబుతున్నా చాలామంది రైతులు వారి మాటలను పట్టించుకోవడం లేదు. ఎప్పటిలాగే గతేడాది మిర్చి సాగు చేశారు. వరుసగా రెండో ఏడాది కూడా తామరపురుగు దెబ్బ మిర్చితోటలపై పడడంతో ఈసారి మిర్చి సాగు చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందోన్న ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. వరుసగా మిర్చి సాగు చేస్తూ వస్తున్న రైతులు మాత్రం ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లేందుకు మక్కువ చూపడం లేదు. మరికొందరు రైతులు మాత్రం మిర్చి సాగుపై డోలాయమానంలో ఉన్నారు. కొందరు మాత్రం ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటల్లో నిమగ్నమయ్యారు. ఏది ఏమైనా ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో మిర్చి సాగు పరిస్థితి డోలాయమానంలో పడింది.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

పారిశుధ్య పరిస్థితి

సంతృప్తిగా లేదు

- ఖమ్మానికి బ్రాండ్ ఇమేజ్ వచ్చేలా అభివృద్ధి జరగాలి
- వెలుగుమట్ల, ఖిల్లాలను మరింత సుందరీకరించాలి
- రోడ్లమీదకు ర్యాంపులు వేయకుండా చర్యలు చేపట్టాలి
- ఖమ్మం కార్పొరేషన్ సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల

ఖమ్మం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య పరిస్థితి సంతృప్తికరంగా లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలం వచ్చిన నేపథ్యంలో నగరంలో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఖమ్మం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శనివారం నగర అభివృద్ధిపై కార్పొరేటర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ నగరంలో ప్రస్తుతం పారిశధ్య పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. రోడ్లు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీలు ఎక్కడా బ్లాక్ కాకుండా, నీరునిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అందుకు అవసరమైన సిబ్బందిని, వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీలు ఆక్రమించి చేపట్టే ర్యాంపుల కట్టడాలను నియంత్రించాలన్నారు. డంపింగ్‌యార్డుకు చెత్త తరలించే వాహనాలకు ఇబ్బందులు లేకుండా నిర్మాణం చేపట్టాలన్నారు. డంపింగ్ యార్డులో చెత్తను ఎప్పటికప్పుడు రీసైక్లింగ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, పైప్‌లైన్ లీకేజీలు ఉంటే, వెంటనే నియంత్రించాలన్నారు. నగరంలోని చెరువులు కలుషితం కాకుండా త్వరలో అండర్‌గౌండ్ డ్రైనేజీని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాని సూచించారు. అధికారులు ప్రజా సమస్యల పట్ల వెంటనే స్పందించాలని, ఆయా పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. డివిజన్లలో రోడ్లకు ఇరువైపుల మంచి మొక్కలు నాటాలని, విద్యుత్ తీగలకు అడ్డువచ్చేలా మొక్కలు నాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పనులు చేయాలి

ఖమ్మం నగర అభివృద్ధికి సంబంధించి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పనులు పూర్తిచేయాలన్నారు. ఖమ్మానికి బ్రాండ్ ఇమేజ్ ఉండేలా సమగ్ర అభివృద్ధి జరగాలన్నారు. ఖమ్మం నగరం పరిశుభ్రంగా, అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, తద్వారా అన్ని వర్గాల ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు భరోసా కలగాలన్నారు. నగరంలో మంచి గాలి, సురక్షిత తాగునీరు, మంచిరోడ్లు కల్పించాలన్నారు. రోడ్ల వెడల్పుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. నగరంలో అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల వెడల్పుకు ప్రజలను ఒప్పించాలన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు నగరంలోకి రాకుండా ఉండేలా త్వరలో హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరానికి నాలుగువైపులా వెళ్తున్న హైవేలను కలుపుతూ రింగ్‌రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. వర్షాకాలం తర్వాత నగరంలో శాశ్వత పనులపై కార్యాచరణ చేయాలన్నారు. వెలుగుమట్ల అర్బన్‌పార్క్, ఖిల్లా వంటి వాటిని మరింత సుందరీకరించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి, నగర అభివృద్ధికి చేయాల్సిన పనులకు కార్యరూపం తెస్తానన్నారు. ప్రజలకు తాగునీరు, విద్యుత్, శానిటేషన్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ, నగర అభివృద్ధికి ప్రగతి ప్రణాళిక చేయాలన్నారు. ఆదాయం పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధ చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తి, వాణిజ్య, నీటి పన్నుల వసూలు ద్వారా, లేఅవుట్ అనుమతుల నుంచి ఆదాయం పెంచుకోవాలన్నారు. అనుమతి లేకుండా, అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై ముందస్తుగానే చర్యలు చేపట్టాలన్నారు. చెత్త సేకరణ సమర్థవంతంగా చేయాలన్నారు. ప్రజా సమస్యలపై స్పందించి, మెరుగైన సేవలు అందించాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ శానిటేషన్ ప్రణాళిక చేస్తున్నామని, వార్డుల వారీగా ఆయా ప్రణాళికలను కార్పొరేటర్లకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్పొరేషన్‌కు సంబంధించిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్, పరికరాల మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు. నగరపాలక సంస్థకు మంత్రి హోదాలో వచ్చిన తుమ్మలను మేయర్, కార్పొరేటర్లు సన్మానించారు. సమీక్ష సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, ఎలక్ట్రిసిటీ ఎస్‌ఈ సురేందర్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, మునిసిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పురపాలక సంఘం కార్యాలయము, కొత్తగూడెం :: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

పెన్షన్ రికవరీ నోటీసు

కొత్తగూడెం మునిసిపల్ అధికారులు అందించిన పింఛన్ రికవరీ నోటీసు

'ఆసరా'

పింఛన్లపై సర్వే..

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బయటపడ్డ 200పైగా అక్రమ పింఛన్లు
- రికవరీ నోటీసులు జారీ చేసిన అధికారులు..
- రెండు పింఛన్లపై 80ఏళ్ల వృద్ధురాలికి కూడా..
- ఇప్పటికే కూతురుకు సంబంధించిన పెన్షన్ పొందుతున్న మల్లమ్మ
- రూ.1,72,928 తిరిగి చెల్లించాలని ఆదేశం
- వృద్ధురాలికి నోటీసులపై 'ఎక్స్'లో ప్రభుత్వంపై మాజీమంత్రి కేటీఆర్ విమర్శలు

కొత్తగూడెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆసరా అక్రమ పింఛన్లపై ప్రభుత్వం సెర్ప్ అధికారులతో నిర్వహిస్తున్న సర్వేలో అనేక అక్రమ పింఛన్లు బయపడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన సర్వేలోనూ సుమారు 200కు పింఛన్లు నిబంధనలకు విరుద్ధంగా పొందుతున్నారని గుర్తించారు. అయా ఫింఛన్‌దారులను గుర్తించిన సెర్ప్ అధికారులు సంబంధిత ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. దీంతో డీఆర్‌డీఏ సెర్ప్, మునిసిపల్ అధికారులు అక్రమంగా ఆసరా పింఛన్ పొందుతున్న వారికి నోటీసులు జారీ చేశారు. జిల్లాలో రిటైర్డ్ అయి పెన్షన్ పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు, సింగరేణి ఉద్యోగులుగా రిటైరైన పెన్షన్ పొందుతున్న వారు సైతం గత పదేళ్లుగా ఆసరా పింఛన్ పొందుతున్నారు. వీరిలో వృద్ధులు, దివ్యాంగులు సైతం ఉన్నారు. ఇటీవల సర్వే నిర్వహించిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా డబుల్ పింఛన్ పొందుతున్న వారి జాబితాను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాబితాలో

(మిగతా 7వ పేజీలో)

ఎస్టీల అభివృద్ధికి అధికారులు కృషిచేయాలి

- గిరిజనుల అభివృద్ధి కోసమే ఐటీడీఏలు
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్
- కొత్తగూడెం ఐడీవోసీ, భద్రాచలం ఐటీడీఏలో గిరిజన నాయకులు, అధికారులతో సమావేశం

కొత్తగూడెం/భద్రాచలం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ తెగలకు చెందిన ప్రజల సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ సూచించారు. కొత్తగూడెం జిల్లాలో శనివారం పర్యటించిన ఆయన భద్రాచలంలోని ఐటీడీఏ, కొత్తగూడెంలోని ఐడీఓసీ కార్యాలయంలో అధికారులు, గిరిజన నాయకులతో సమావేశం నిర్వహించారు. కొత్తగూడెం ఐడీఓసీలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముందుగా భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లాలో షెడ్యూల్ తెగల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై వివరించారు. అనంతరం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్డ్ తెగల హక్కుల పరిరక్షణకై అధికారులు కృషి చేయాలని, షెడ్యూల్డ్ తెగల సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పనకు కృషి చేయాలన్నారు. ఏదైనా కేసును విచారించే విషయంలో సివిల్‌కోర్టుకు ఉండే అధికారాలు ఎస్టీ కమిషన్‌కు ఉంటాయని, ఏ చిన్న సమస్యనైనా నిర్లక్ష్యం చేయకూడదన్నారు. అధికారులు తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యపై స్పందించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలో చదువుకునే విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం పలు మండలాల నుంచి గిరిజనులనుంచి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు. ఆయా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు. తెలంగాణలో ప్రధానంగా నాలుగు ఉమ్మడి జిల్లాలైన ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్‌రాజ్, ఎస్‌ఈ ఎన్‌పీడీసీఎల్ కొత్తగూడెం బికం సింగ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ట్రావెల్ వెఎల్ఫర్ డీడీ మానెమ్మ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, సీపీవో శ్రీనివాసరావు, కొత్తగూడెం ఆర్డీవో మధు, జిల్లా సంక్షేమ అధికారి అనసూయ, బీసీ వెఎల్ఫర్ అధికారి ఇందిర, సివిల్ సప్లయీస్ అధికారి రుక్మిణి, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ పాల్గొన్నారు.

ఐటీడీఏలో గిరిజన నాయకులు, అధికారులతో సమావేశం

ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం పని చేసేందుకు ఐటీడీఏలు ఏర్పాటు చేశారని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో శనివారం వివిధ ఆదివాసీ గిరిజన నాయకులు, అధికారులతో పలు సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు రాష్ట్రాయిలో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తేవాలని సూచించారు. గిరిజనులకు సంబంధించిన భూ, వ్యక్తిగత సమస్యలు పెండింగులో ఉంటే వాటిపై పది రోజుల్లో నివేదిక అందజేయాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. ట్రైకార్ పథకం లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని, గిరిజన వికాసంపై గిరిజనుల్లో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైకార్ జీఎం శంకర్రావు, ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఆర్డీవో దామోదర్‌రావు, డీడీ మణెమ్మ, ఆర్సీవో వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సారపాక బీపీఎల్ అతిథి గృహంలో ఐటీసీలో పని చేసే కార్మికుల సమస్యలపై యూనియన్ ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఐటీసీలో పని చేసే సిబ్బంది తెలంగాణ వారై ఉండి అందులో అధిక శాతం గిరిజనులకే అవకాశం ఇవ్వాలన్నారు. యాజమాన్యం వేతనాలు సక్రమంగా చెల్లించాలని సదుపాయాలు సక్రమంగా కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

'కొర్రమీను' కథ కంచికి!



- వైరాలో మూలనపడ్డ విత్తనోత్పత్తికేంద్రం
- గతంలో రెండుసార్లు ప్రయోగం
- పూర్తిస్థాయి ఎఫ్‌డీవో లేక మూలనపడ్డ ప్రక్రియ
- సర్కార్ దృష్టి సారిస్తే మంచి ఫలితాలు సాధించే అవకాశం

రాష్ట్రంలో తొలిసారి ఖమ్మం జిల్లా వైరా మత్స్య విత్తనోత్పత్తి క్షేత్రంలో చేపట్టిన కొర్రమీను చేపపిల్లల ఉత్పత్తి కథ కంచికి చేరింది. ఇది కేవలం ఆర్భాటానికే పరిమితమైందనే విమర్శలున్నాయి. తొలిసారి 2018లో ఆ తర్వాత 2022లో రాష్ట్రంలోనే తొలిసారిగా వైరాలో కొర్రమీను చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. 2018 జూలై, ఆగస్టు నెలల్లో కొర్రమీను చేపపిల్లల ఉత్పత్తిని ప్రయోగాత్మకంగా చేపట్టారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2017లో రాష్ట్రంలో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. దాంతో వైరాలోని మత్స్య విత్తన క్షేత్రంలో ప్రభుత్వం నూతనంగా కొర్రమీను పునరోత్పత్తిని చేపట్టింది. ఇండ్యూస్ బ్రీడింగ్ పద్ధతి ద్వారా కొర్రమీను చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియను చేపట్టారు. మేలుజాతి కొర్రమీను ఆడ, మగ చేపలకు పిట్యూటరీ గ్లాండ్, హెచ్‌సీజీ ఇంజక్షన్ చేసి ఆర్‌సీసీ నర్సరీల్లోని ఆపాల్లో(వలల గదుల్లో) అలాగే ఎఫ్‌ఆర్‌బీ టబ్స్‌లో వదిలారు. 6

వైరా



మధిరలో మాట్లాడుతున్న కేజీ రాంచందర్

కుల, మత వ్యవస్థ..

సమాజానికి పట్టిన చీడ

- మాస్‌లైన్ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంచందర్
- మధిరలో పీవైఎల్ రాష్ట్ర శిక్షణ తరగతులు 7

హైకోర్టులో జీపీలుగా 7

ఉమ్మడి జిల్లా వాసులు

పాల్వంచ, పాద్దుటూరు వాసులకు దక్కిన గౌరవం

నేడు కొత్తగూడెంలో 6

ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతుల పరిశీలన



భద్రాద్రి జిల్లాలో

18 మంది ఎస్‌ఐల బదిలీలు

ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ రోహిత్‌రాజు 7

గాంధర్వ గానం

ఖమ్మం 'ఘంటసాల' దేవపాంగు దేవప్రియ ప్రత్యేకత..

బక్కపలచని దేహంతో ఏమాత్రం అంచనాల్లేకుండా ఉంటాడు.. కానీ ఆయన గొంతువిప్పి పాట పాడితే స్వర్గీయ ఘంటసాల ప్రేక్షకుల కళ్ల ముందుకు దిగివచ్చినట్లుంటుంది.. చిన్నప్పుడు బడిలో చదువు చెప్పే టీచర్లు ప్రతి రోజూ పాఠం అప్పచెప్పేమనే వారు కాదుకానీ పాటలు పాడించుకొని మురిసిపోయే వారు.. సంగీత దర్శకుడు సత్యం, పద్మశ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణల చేతుల మీదుగా బహుమతులు అందుకున్న ఘనత ఆయనది..



పాట పాడుతున్న దేవప్రియ..



- ప్రముఖుల అభినందనలు అందుకున్న ఘనత
- ఘంటసాల లేని లోటు తీర్చుతున్న ఖమ్మం కవి
- బతుకుబాటలో చర్మకార వృత్తి
- వయస్సు పైబడినా తగ్గని గాన మాధుర్యం

ఖమ్మం సాంస్కృతికం, జూలై 12 దివంగత సినీనేపథ్య గాయకుడు పద్మశ్రీ ఘంటసాల పేరుతెలియని వారుండరు. ఆయన పాడినపాటలు వినని చెవులుండవు.. గాన మాధుర్యంలో ఓలలాడించే గాంధర్వ స్వర ఝరి ఆయనది.. అందుకే పాటల పల్లకిలో ఆయనది ప్రత్యేక స్థానం.. అయితే ఆయనను ప్రత్యక్షంగా చూసినవారు, సంగీత కచ్చేరి లేదా పాటలు పాడుతుండటం స్వయంగా వీక్షించే భాగ్యం అందరికీ దక్కలేదు.. ఆ కొరతను తీరుస్తూ ఖమ్మం ఘంటసాలగా రెండు తెలుగు రాష్ట్రాల సంగీతాభిమానుల్లో పేరు తెచ్చుకున్నాడు.. ఖమ్మం గుమ్మం కవి, కళాకారులకు పుట్టిల్లు నగరంలోని గుట్టల బజార్ జహీర్‌పురకు చెందిన దేవపాంగు దేవప్రియ సంగీతాభిమానులను మైమరిపించే మంత్రముగ్ధ స్వరం ఆయనది..

అచ్చం ఘంటసాల గొంతును అనుకరిస్తూ పాడే పాటలు గత అయిదారు దశాబ్దాలుగా సినీ సంగీత ప్రియులను ఆకట్టుకున్నాయి.. దశాబ్దాల తరబడి ఘంటసాల పాటలతో సినీ సంగీతాభిమానులను అలరించటమే కాక ఉభయ రాష్ట్రాల్లో ఖమ్మం గుమ్మం కళారంగ ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్నాడు. ఘంటసాల కెరియర్‌లో బిగ్గెస్ట్ హిట్స్‌గా నిలిచిన పలు ఛాలెంజింగ్ పాటలను సైతం రాగయుక్తంగా గమకాల సహితంగా ఆలపించటం దేవప్రియ ఘనత.. శివశంకరి, రసికరాజ తగువారముకామా, రాగమయి రావే, నందుని చరితను వినుమా, నిన్న కనిపించింది. అమ్మా అని పిలిచినా ఆలకించేవేమమ్మా.. పాటలతో ఉమ్మడి తెలుగు రాష్ట్ర సంగీత ప్రపంచంలో ప్రత్యేక ముద్ర సాధించిన ఈ గాయకుడు దశాబ్దాల తరబడి అభిమానులను సంపాదించుకున్నాడు.. నెల్లూరు, విజయవాడ, ఒంగోలు, రాజమండ్రి, కావలి, కాకినాడ, విశాఖ పట్టణం, తదితర అనేక చోట్ల వేలాది పాటలను పాడాడు..

చిన్నతనం నుంచే..

డిగ్రీ వరకు చదువుకున్న దేవప్రియకు పాఠశాల దశలోనే పాటల పరిమళం అంటింది.. రేడియోలో, మైకుల్లో వచ్చే పాటలను మైమరిచి వినేవాడు.. సినీ సంగీత ప్రపంచంలో ఘంటసాల హవా కొనసాగుతున్న సమయం కనుక ఆయన పాటలే విని తనూ వాటిని పాడే వాడు.. క్రమంగా గొంతును అనుకరిచటం అలవరుచుకున్నాడు.. దీంతో పాఠశాలలో పాఠాలు చెప్పే టీచర్లు ఆయన అభిమానులుగా మారి ప్రతి రోజు పాటలు పాడించే వారు.. అలా ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ పాటల పోటీలున్నా పాల్గొని ప్రథమ బహుమతి సాధించేవాడు.. అలా మంగళం పల్లి బాలమురళీ కృష్ణ, సంగీత దర్శకుడు సత్యం చేతుల మీదుగా బహుమతులు అందుకున్నాడు.

వృత్తిని గౌరవిస్తూ...

వందకు పైగా అవార్డులు, రెండు బంగారు పతకాలు ఆయన పాటల ప్రస్థానం సాధించిన ఘనత.. ఇదంతా నాణానికి ఒక పక్క.. తనలోని కళ అభిమానులను ఏర్పరచటానికే తప్ప పొట్ట నింపే ఆదరవు ఇవ్వకపోవటంతో తనలోని రాగ ప్రతిభను పక్కనబెట్టి, సమాజంలో ఏర్పడిన గౌరవస్థానాన్నీ పక్కకు పెట్టి బతుకు తెరువు కోసం తన కుల వృత్తిగా అబ్బిన చెప్పులు కుట్టే పనిచేస్తూ ఆదర్శంగా నిలిచాడు. ఖమ్మం పాత బస్టాండ్ పక్కన దశాబ్దాల పాటు చెప్పులు కుట్టే చర్మకార వృత్తిని సాగించి వృత్తి గౌరవం నిలిపాడు..

ఘంటసాల ప్రేరణ...

1967లో ఒక మిల్లు ప్రారంభించేందుకు ఖమ్మం వచ్చిన ఘంటసాలను అతి దగ్గరనుంచి చూడటం ద్వారా ఆయన పాటలు పాడే విధానంలో మెళకువలను గ్రహించే యత్నం చేశాడు.. అలా గుర్తింపు తెచ్చుకుంటూ 1970లో ఆర్కెస్ట్రా ప్రారంభించి సభలకు, సమావేశాలకు, పాటలను అందించే వాడు.. ఘంటసాల మరణానంతరం ఆయనకు పాటల నివాళిగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఏర్పాటుచేసి ఘంటసాల పాడిన పాటలను ఆలపించేవాడు..

వయస్సు పైబడటంతో కుల వృత్తినుంచి వైదొలగినా ఆయన గొంతులో సంగీత ప్రతిభ మాత్రం ఇంకా చెక్కుచెదరలేదు. ఇప్పటికీ ఏదో ఒక చోట ఏర్పాటయ్యే సభలో ఘంటసాల కంఠంతో అలరిస్తుంటాడు..

ఆర్టీసీ కార్గోలో నూతన ఏజెన్సీకి అవకాశం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై13: ఖమ్మం జిల్లా పరిధిలోని టీజీఆర్టీసీ కార్గోసేవలను మరింత విస్తరించేందుకు జిల్లాల్లోని పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాలలో నూతన కార్గోఏజెంట్లను నియమించడానికి ఆర్టీసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆసక్తిగల ఏజెంట్లు కంప్యూటర్, ప్రింటర్, వేయింగ్ మిసన్ కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ఏటీఎంటీ పవన్‌కుమార్ తెలిపారు. మరింత సమాచారం కొరకు 9154298582, 9154298585 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

401 అడుగులకు చేరిన కిన్నెరసాని ప్రాజెక్టు నీటిమట్టం

పాల్వంచ రూరల్, జూలై 13: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయం పూర్తిసామర్థ్యానికి చేరువలో ఉంది. ప్రాజెక్టు నీటిమట్టం శనివారం సాయంత్రానికి 401అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయానికి వరద పెరుగుతోంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 1,000 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థం 407 అడుగులు కాగా ప్రస్తుతం నీటిమట్టం 401 అడుగులకు చేరుకుంది. రోజుకు ఒక అడుగు చొప్పున నీటిమట్టం పెరుగుతుండటంతో జలాశయం అధికారులు అప్రమత్తమవుతున్నారు.

స్వల్పంగా పెరిగిన వైరా నీటిమట్టం

వైరా, జూలై 13: వైరా రిజర్వాయర్ నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. శనివారం ఉదయానికి నీటిమట్టం ఏడు అడుగులకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలతో ఒకట్రెండు అంగుళాల చొప్పున నీటిమట్టం పెరిగింది. శుక్రవారం 6.4అడుగులుగా ఉన్న నీటిమట్టం శనివారానికి ఏడు అడుగులకు చేరుకుంది. ఇటీవల కాలంలో అర అడుగుకుపైగా నీటిమట్టం పెరగడం విశేషం. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులుగా ఉంది. ఇంకా 11.3అడుగుల నీరు వచ్చి చేరితే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుతుంది.

'కొర్రమీను' కథ కంచికి !

- వైరాలో మూలనపడ్డ విత్తనోత్పత్తికేంద్రం
- గతంలో రెండుసార్లు ప్రయోగం

వైరా, జూలై 13: ఒడిశా రాష్ట్ర భువనేశ్వర్‌లో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ ఆక్వా ఫ్రెష్‌వాటర్ కల్చర్(సిఫా)తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకొని వైరాలో ఈ కొర్రమీను పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. సిఫా సీనియర్ శాస్త్రవేత్తలు, జిల్లా, స్థానిక మత్స్యశాఖ అధికారులు చర్చించిన మీదట ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. 2018 జూలైలో మొదట ఈ ప్రక్రియ చేపట్టగా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. అయితే అదే సంవత్సరం ఆగస్టులో కొంత పురోభివృద్ధి సాధించినా ఆ తర్వాత ముందుకు సాగలేదు. సిఫాకు చెందిన శాస్త్రవేత్తలు



పునరోత్పత్తి కోసం సిద్ధం చేసిన కొర్రమీను

సాంకేతిక సలహాలు అందజేశారు. ఆ ఏడాది జూలైలో ఆశించిన ఫలితం రాకపోయినా ఆగస్టులో మాత్రం దాదాపు లక్షల గుడ్లను సాధించి వాటి ద్వారా 60వేలకుపైగా కొర్రమీను పిల్లలను ఉత్పత్తి చేశారు. ఉత్పత్తి అయిన కొర్రమీను పిల్లలకు ప్రత్యేకంగా ఆర్టీమియానాప్లియా అనే ఆహారాన్ని అందించారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న దానా ద్వారా ఇంకులేషన్ పద్ధతిలో దాదాపు 24గంటల సేపు ఆక్సిజన్‌తో కొర్రమీను పిల్లలకు అవసరమైన ఆహారాన్ని తయారుచేశారు.

కొర్రమీను రకం ఇతర జీవరాశులను తిని పెరుగుతుంది. ఈ విధంగా అప్పుడు కొంత పురోగతి ఉన్నా ఆ తర్వాత మూలనపడింది. అనంతరం ఇక్కడ ఎఫ్‌డీవోను డిప్యూటేషన్‌పై సిరిసిల్ల జిల్లా డీఎఫ్‌వోగా బదిలీ చేయడంతో ఈ ప్రక్రియ మూలనపడింది. అయితే 2022లో ఇక్కడ డిప్యూటేషన్‌పై వచ్చిన ఎఫ్‌డీవో తిరిగి మళ్లీ సిఫా శాస్త్రవేత్తల సహకారంతో కొర్రమీను చేపపిల్లల ఉత్పత్తి చేపట్టి కొంత సత్ఫలితాలు సాధించారు. అయినా పూర్తిస్థాయిలో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. 2023లో డిప్యూటేషన్‌పై వచ్చిన ఎఫ్‌డీవో ఏసీబీ కేసులో ఇరుక్కొని ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇక ఆ తర్వాత నుంచి కొర్రమీను చేపపిల్లల ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. వెచ్చించిన లక్షలాది రూపాయల నిధులు వృథా అయ్యాయి. గత ప్రభుత్వం వైరాలో కొర్రమీను చేపపిల్లల



కొర్రమీను చేపపిల్లల ఉత్పత్తికి సిద్ధం చేసిన మట్టి నర్సరీ

ఉత్పత్తిని విజయవంతంగా చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా ఆ పిల్లలను సరఫరా చేసి ఆ జాతిరకం చేపలను అభివృద్ధి చేయడం కోసం చేసిన ప్రయత్నాలు నీరుగారిపోయాయి. ప్రస్తుతం వైరా చేపపిల్లల ఉత్పత్తి కేంద్రానికి అధికారి కరువయ్యారు. జిల్లా ఏడీఎఫ్ ఆంజనేయస్వామి ఇక్కడ ఇన్‌చార్జ్ ఎఫ్‌డీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థత కలిగిన ఎఫ్‌డీవోను నియమించి గతంలోని ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన కొర్రమీను చేపపిల్లల ఉత్పత్తిని కొనసాగించి ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



జోస్ ఆలుక్కాస్ షోరూంను ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సినీ నటి సంయుక్తా మీనన్, చైర్మన్ జోస్ ఆలుక్కా, డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా

ఖమ్మంలో జోస్ ఆలుక్కాస్ సరికొత్త షోరూమ్ ప్రారంభం

ఖమ్మం కల్చరల్ జూలై 13: జోస్ ఆలుక్కాస్ తమ సరికొత్త షోరూంను తెలంగాణలోని ఖమ్మంలో ప్రారంభించింది. ఈ షోరూంను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో సెలబ్రిటీ గెస్ట్‌గా సినీనటి సంయుక్త మీనన్ పాల్గొన్నారు. మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జోస్ ఆలుక్కా ఈ వేడుకకు హాజరయ్యారు. ప్రారంభోత్సవ ప్రతేక ఆఫర్‌గా కనీసం రూ.60వేల విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు ప్రోత్సాహకంగా ఒక బంగారు నాణేన్ని అందుకుంటారు.

ఈ అవకాశం జూలై 19 వరకు లభ్యమవుతుంది. వినియోగదారులు వజ్రాలపై 20శాతం తగ్గింపును, ప్లాటినం ఆభరణాలపై 7శాతం తగ్గింపును పొందవచ్చు. అదనంగా వివాహ వేడుకల కోసం చేసే కొనుగోళ్లపై ఆకర్షణీయమైన తగ్గింపులు ఉంటాయి. ప్రతీ కొనుగోలుపై ఒక ఉచిత బహుమతి కూడా లభిస్తుంది. వినియోగదారులు తమ పాత బంగారాన్ని హెచ్‌యూఐడీ హాల్‌మార్క్ కలిగిన కొత్త బంగారు ఆభరణాలతో ఎక్స్‌చేంజ్ చేసుకోవాలని, వాటితో లభించే లాభాలను సద్వినియోగం చేసుకోవల్సిందిగా యాజమాన్యం తెలిపింది. ఈ సరికొత్త షోరూమ్‌లో వైవిధ్యభరితమైన, ఆకర్షణీయమైన బంగారు ఆభరణాలు, వజ్రాలు, ప్లాటినం, వెండి కలెక్షన్లు అద్భుతమైన డిజైన్లు కొలువుతీరి ఉన్నాయని చైర్మన్ జోస్ ఆలుక్కా తెలిపారు.

నేడు కొత్తగూడెంలో ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

కొత్తగూడెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు స్థానిక రైల్వేస్టేషన్‌ను సందర్శించి అక్కడ ప్రయాణికుల మౌళిక వసతులను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచి కొత్తగూడెంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. ఈ సందర్భంగా చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాలు, కొత్తగూడెం పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కలవనున్నట్లు ఎంపీ రఘురాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4గంటలకు పాల్వంచలోని పెద్దమ్మతల్లి దేవస్థానానికి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 4:30గంటలకు కేటీపీఎస్ అతిథి గృహానికి చేరుకుని అక్కడ పాల్వంచ రూరల్, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కలుస్తారు.

సంస్కృతి వికాసం కళల వల్లనే సాధ్యం

- హాస్యబ్రహ్మ డా. శంకర నారాయణ
- ఆకట్టుకున్న స్వర నృత్య నీరాజనం

భద్రాచలం, జూలై 13: సమాజంలో సంస్కృతి వికాసం కళల వల్లనే సాధ్యమవుతుందని హాస్యబ్రహ్మ డాక్టర్ శంకరనారాయణ అన్నారు. భద్రాచలంలోని రామాలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో శనివారం జరిగిన స్వర నృత్య నీరాజనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ సంస్కృతి, ధర్మం మూర్తీభవించిన శ్రీరామ చంద్రుడు వెలసిన భద్రాచలం తెలుగువాళ్లకు రెండో అయోధ్యని అన్నారు. బాల బాలికలు ఆనందం కలిగించే కళలు ప్రదర్శించి మన దేశానికి ప్రపంచంలో మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. హైదరాబాద్‌లోనే కాకుండా శ్రీశైలం, కాణిపాకం, అహోబిలం, శ్రీకాళహస్తి, స్వర్ణగిరి వంటి దేవాలయాల్లో రాగరమ్య సంస్థ ద్వారా బాలల సంగీత కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించిన రమ్యను శంకర నారాయణ అభినందించారు. 80 మంది బాల బాలికలు అద్భుతమైన



మాట్లాడుతున్న హాస్యబ్రహ్మ శంకరనారాయణ

కళలు ప్రదర్శించారు. కాగా స్వరనృత్య నీరాజనంలో బాల బాలికలు చేసిన శాస్త్రీయ సంప్రదాయ నృత్యాలు రసజ్ఞులైన ప్రేక్షకులు, భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంగీత, నృత్య గురువులు దుర్గా భవాని, విద్యాలత, జయశ్రీ, డాక్టర్ సౌజన్యరాజన్ కళాకారులు మళ్ల మోహన్‌కుమార్, కొండల్‌రావు, లాస్య భారతి పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు మాదినేని

- హైదరాబాదు రైతు సంఘం రాష్ట్ర కార్యాలయానికి ఆయన పేరు

చింతకాని, జూలై 13: క్రమశిక్షణకు మారుపేరుగా, పేదల కోసం జీవితాంతం పోరాడిన వ్యక్తి మాదినేని రామలింగయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలో నిర్వహించిన మాదినేని రామలింగయ్య సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. రామలింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామలింగయ్య సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి చేశాడన్నారు. సీపీఎం నాయకునిగా తన ఇంటినే పార్టీ కార్యాలయంగా మార్చి పార్టీ అభివృద్ధిలో విశేషమైన పాత్ర నిర్వహించారు. తుదిశ్వాస వరకు పార్టీలోనే కొనసాగరని, ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని యువత ప్రజా పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. దేశంలో కమ్యూనిజం అంతం కాకూడదని ప్రగాఢంగా నమ్మే వ్యక్తి రామలింగయ్య అన్నారు. రామలింగయ్య కుమారులు పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన కుమారుడు మాదినేని రమేష్ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారన్నారు.



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఆయన పార్టీకు చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదులోని రైతు సంఘం రాష్ట్ర కార్యాలయానికి ఆయన పేరును పెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు నల్లమల నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, పీ సాగర్, అన్నవరపు కనకయ్య, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, కాసాని ఐలయ్య, చంద్రారెడ్డి, జంగారెడ్డి, మన్నెపల్లి సుబ్బారావు, జమ్ముల జితెందర్‌రెడ్డి, వత్సవాయి జానకిరాములు, రాచబంటి రాము తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యకారులను ప్రోత్సహించటం సమాజానికి అవసరం

- ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు
- హెచ్ ఆర్ సీ అవార్డు ఎంతో విశిష్టమైనది..
- ప్రముఖ కవి ఆశారాజు
- ఘనంగా హెచ్‌ఆర్‌సీ పురస్కార, అవార్డుల ప్రదానోత్సవం..

ఖమ్మంసాంస్కృతికం, జూలై 13: సృజనశీలురైన సాహిత్యకారులను ప్రోత్సహించటం నేటి సమాజానికి ఎంతో అవసరమని ప్రముఖ సాహితీ వేత్త మువ్వా శ్రీనివాసరావు అన్నారు.. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో శనివారం హెచ్‌ఆర్‌సీ అధ్యక్షురాలు తోట సుభాషిణి అధ్యక్షతన జరిగిన హసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ పురస్కార, అవార్డుల ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. కవులు, కథా రచయితలు సమాజానికి దిక్సూచి లాంటి వారన్నారు. సమాజంలో రుగ్మతలను తమ రచనల ద్వారా పారదోలటంతోపాటు పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను సైతం ఎండగడుతూ ప్రజా చైతన్యాన్ని నూరి పోస్తారన్నారు. కవిత్వం, కథలు రాసే సృజన కారులకు సాహిత్య సంస్థలు వెన్నుదన్నుగా నిలుస్తూ ప్రోత్సహిస్తుండటం అభినందనీయం అన్నారు. ప్రోత్సాహం ఉన్నప్పుడే రచయతలు మరింత రాణిస్తారని తెలిపారు. అవార్డులు, నగదుబహుమతులను ఆశించే వారినికాక సమాజ హితం కోరుతూ రచనలు చేసే వారిని గుర్తించాలన్నారు.



ఆశారాజుకు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు, అతిథులు

ప్రజా కవులు, రచయితలను కాపాడుకోవలసిన అవసరం ఉందన్నారు. హెచ్ ఆర్‌సీ ఫౌండేషన్ ద్వారా ఆతరహా కృషి జరుగుతుండటం అభినందనీయం అన్నారు.

హెచ్‌ఆర్‌సీ పురస్కారం ఎంతో విశిష్టమైనది

హసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ (హెచ్‌ఆర్‌సీ) పురస్కారం తనకు ఎంతో విశిష్టమైనదని ప్రముఖ కవి ఆశారాజు అన్నారు. హెచ్‌ఆర్‌సీ 2024 సాహిత్య పురస్కారం అందుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు పురస్కారం అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించిన వెంటనే సంస్థ గురించి తెలుసుకున్నానని సాహిత్యం కోసం ఒక మహిళ ఒంటరిగా కృషి చేస్తుండటంతోపాటు తన తండ్రి, కూతురు స్మారకంగా సాహిత్య సంస్థను నెలకొల్పిన విషయం నచ్చిందన్నారు. కవిత్వ గుమ్మం లాంటి ఖమ్మంలో తాను పురస్కారం అందుకోవటం మరింత సంతోషంగా ఉందన్నారు.

ఘనంగా పురస్కారాలు, బహుమతులు

హెచ్‌ఆర్‌సీ 2024 సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి ఆశారాజు, సాహిత్య గురు పురస్కారాన్ని సీనియర్ కవి కపిల రాంకుమార్‌కు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఇటీవల నిర్వహించిన కథల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ విజేతలు మధుపత్ర శైలజ, రాచమళ్ల ఉపేందర్, పొత్తూరి సీతారామరాజు, కళాగోపాల్, బీవీశివప్రసాద్‌కు కవిత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ విజేతలు బీవీ శివప్రసాద్, నాగజ్యోతి శేఖర్, కటుకోజ్వల రమేష్, సాంబమూర్తి లండ, తెలుగు వెంకటేష్‌కు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితి సాహిత్య సంస్థ రాష్ట్ర కన్వీనర్ కె.ఆనంద చారి, ప్రముఖ విశ్లేషకుడు శ్రీరాం పుప్పాల, ప్రముఖ కథారచయత శిరంశెట్టి కాంతారావు, యువ కవి అనిల్‌డానీ ప్రజా గాయకులు మేడగాని శేషగిరి, రౌతు రవి, మువ్వాజయశ్రీ హెచ్ ఆర్‌సీబాధ్యులు భాష్య కార్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బవరంలో బీసీ గురుకులాల వద్ద తల్లిదండ్రుల రాస్తారోకో

వైరా, జూలై 13: మండలంలోని రెబ్బవరం గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే, బీసీ సంక్షేమ బాలికల గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులు వైరా-జగ్గయ్యపేట, మధిర ఆర్‌అండ్‌బీ రహదారిపై శనివారం హఠాత్తుగా రాస్తారోకోకు దిగారు. ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న ఓ ప్రైవేట్ భవనంలో మునలిమడుగు, వైరా పేరుతో ఉన్న రెండు బీసీ బాలికల గురుకులాలను నిర్వహిస్తున్నారు. ఒకే భవనంలో రెండు బాలికల గురుకులాలు ఏర్పాటుచేయడంతో 770 మందికి పైగా విద్యార్థినులు ఉన్నారు. ఈ రెండు గురుకులాలకు కేవలం నాలుగు బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు మాత్రమే ఉండటంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి సకాలంలో స్నానాలు చేసి తరగతులకు సిద్ధం కావడానికి అనేక ప్రయాసలకు గురవుతున్నారని ఆరోపిస్తూ విద్యార్థినుల తల్లిదండ్రులు రాస్తారోకోకు దిగారు. రెండో శనివారం కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వందలాదిమంది తల్లిదండ్రులు తమ పిల్లల కోసం వచ్చారు. ఈ సమయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థినులు తమ తల్లిదండ్రుల ముందు ఏకరువు పెట్టారు. సరిపడా టాయ్‌లెట్స్ లేకపోవడం, మెనూ ప్రకారం అల్పాహారం, భోజనాలు పెట్టడం లేదని విద్యార్థినులు చేసిన ఫిర్యాదు మేరకు తల్లిదండ్రులు మొదట యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అక్కడ సరైన సమాధానం రాకపోవడంతో వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేపట్టారు. ఫలితంగా రోడ్డుకు రెండువైపులా వందలాది వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. వైరా ఎస్ఐ ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్ తమ సిబ్బందితో అక్కడకు చేరుకొని విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడారు. బీసీ గురుకులాల అధికారులతో మాట్లాడించి సమస్య పరిష్కారానికి విద్యార్థినుల తల్లిదండ్రులకు హామీ ఇప్పించి రాస్తారోకో విరమింపజేశారు.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆసరా పింఛన్లపై సర్వే..

(5వ పేజీ తరువాయి)

ఉన్న లబ్ధిదారులందరికీ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో అక్రమంగా పొందిన డబ్బులను రికవరీ చేయాలని కూడా ఆ నోటీసులో ఆదేశించారు. దీంతో ఆయా పింఛన్‌దారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

80 ఏళ్ల వృద్ధురాలికి నోటీసు..

భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెం మునిసిపల్ పరిధిలోని బర్మా క్యాంపునకు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు దాసరి మల్లమ్మ తన కుమార్తె దాసరి రాజేశ్వరి హెల్త్ డిపార్టుమెంట్‌లో ప్రభుత్వ నర్సుగా పని చేస్తూ 1993లో గుండెపోటుతో మృతి చెందింది. అయితే రాజేశ్వరి అవివాహితురాలు కావడంతో డిపెండెంట్‌గా ఉన్న తల్లి దాసరి మల్లమ్మకు గత 15 ఏళ్ల నుంచి కుమార్తె ఉద్యోగానికి సంబంధించిన పెన్షన్ నెలకురూ.20వేల చొప్పున పొందుతోంది. దీంతో పాటు గత ప్రభుత్వ హయాంలో అసరా ఫింఛన్ కోసం కూడా దరఖాస్తు చేసుకుంది. అప్పటి పరిస్థితుల్లో అధికారులు ఆమెకు ఆసరా పింఛన్ మంజూరు చేశారు. కాగా ఆ వృద్ధురాలు నిబంధనలకు వ్యతిరేకంగా ఆసరా పింఛన్ తీసుకుంటున్న విషయం సర్వేలో వెలుగు చూడటంతో అధికారులు ఆమెకు నోటీసులు జారీ చేశారు. అయితే ఇదే విషయంపై శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు.

"కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలిక ఊడినట్లు ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ఇస్తామని, ఉన్న సంక్షేమ పథకాలకు వచ్చే డబ్బును పెంచుతామని దొంగ హామీలు ఇచ్చి, గద్దెను ఎక్కిన రేవంత్ సర్కార్ ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న లబ్ధిదారుల నుంచి సొమ్మును వెనక్కి రాబట్టే వింత చేష్టలు మొదలు పెట్టింది" అని ఆరోపించారు. సాంకేతిక కారణాలు చూపిస్తూ వేలాది మంది ఆసరా పింఛన్ లబ్ధిదారుల నుంచి డబ్బును ప్రభుత్వానికి వెనక్కి పంపాలని నోటీసులు ఇసున్నారని విమర్శించారు. "భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దాసరి మల్లమ్మ అనే 80ఏళ్ల ముసలమ్మకు ఆసరా పెన్షన్ కింద వచ్చిన రూ.1,72,928లు ప్రభుత్వానికి తిరిగి కట్టాలని నోటీసు ఇచ్చారని, ఒంటరి మహిళగా పక్షవాతంతో బాధపడుతూ ఉన్న ఆమెలాంటి వృద్ధుల నుంచి కేసీఆర్ సర్కారు ఇచ్చిన ఆసరా పింఛన్ సొమ్మును తిరిగి లాక్కోవడానికి ప్రయత్నించడం రేవంత్ సర్కార్ అమానవీయ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. వెంటనే పేదల మీద ఇటువంటి దుర్మార్గపు చర్యలు మానుకోవాలి... లేకుంటే ప్రజలే కాంగ్రెస్ సర్కార్ మీద తిరగబడతారు" అని కేటీఆర్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

ఈ పరిణామాలపై స్పందించిన రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశంతో శనివారం భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వెంటనే డీఆర్‌డీఏ అధికారులను మల్లమ్మ ఇంటికి పంపించారు. మల్లమ్మకు వస్తున్న కుమార్తె డిపెండెంట్ పెన్షన్ ఉండగా ఆసరా పింఛన్ ఎలా వస్తుందో సమగ్రంగా విచారణ చేశారు. అయితే అధికారులు ఆమె పొందిన ఆసరా పింఛన్ డబ్బులు మొత్తం రూ.1,72,928లు తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని, లేనిపక్షంలో ఆమెకు వస్తున్న పెన్షన్లను రద్దు చేస్తామని నోటీసులో పేర్కొన్నారు. అయితే 80 ఏళ్ల వృద్ధురాలు మల్లమ్మ ప్రస్తుతం పక్షవాతంతో మంచంలో ఉంది. ఈ వ్యవహారంపై ఆమె ఏమీ మాట్లాడలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

నోటీసులను వెనక్కి తీసుకోవాలి

- కాపు సీతాలక్ష్మి, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్

వృద్ధులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన పింఛన్లను రద్దు చేస్తూ, తీసుకున్న పింఛన్ సొమ్మును తిరిగి చెల్లించాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం అన్యాయం. కొత్తగూడెం మునిసిపల్ పరిధిలో 42మందికి నోటీసులు ఇచ్చారు. వాటిని వెంటనే తిరిగి వెనక్కి తీసుకోవాలి. ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలు దుర్మార్గంగా ఉన్నాయి.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

లక్ష్మీదేవిపల్లి, జూలై 13 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర గనుల శాఖామంత్రి కిషన్‌రెడ్డిని భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కేవీ. రంగాకిరణ్ తో పాటు నియోజకవర్గాల కన్వీనర్లు శనివారం హైదరాబాద్‌లో బీజేపీ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై కిషన్‌రెడ్డికి వారు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డి వారితో మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి అనుసరించవల్సిన విధానాల పై వారికి దిశానిర్దేశం చేశారని నాయకులు తెలిపారు. రానున్న మునిసిపల్, గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటే విధంగా ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలిపినట్లు వారు వెల్లడించారు. కిషన్ రెడ్డిని కలిసిన వారిలో నియోజకవర్గ కన్వీనర్లు భిక్షపతి, గోపీకృష్ణ, త్రినాథ రావు,శ్రీనివాసరావులు ఉన్నారు.

హైకోర్టులో జీపీలుగా ఉమ్మడి జిల్లా వాసులు

● పాల్వంచ, పొద్దుటూరు వాసులకు దక్కిన గౌరవం





హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదులుగా నియమితులైన వెంకటరెడ్డి, సుజాత

పాల్వంచ టౌన్, జూలై 13: హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా పాల్వంచకు చెందిన ఈదునూరి వెంకటరెడ్డిని ప్రభుత్వం నియమించింది. వెంకటరెడ్డి తండ్రి కేటీపీఎస్ కర్మాగారంలో ఇంజనీర్‌గా విధులు నిర్వహించేవారు. ఇక్కడే పుట్టి పెరిగిన వెంకటరెడ్డి ప్రాథమిక విద్యాభ్యాసం ఇంటర్ మీడియట్ వరకు పాల్వంచలో సాగింది. అనంతరం విశాఖపట్నంలో న్యాయశాస్త్ర కళాశాలలో న్యాయశాస్త్రలో పట్టభద్రులయ్యారు. వెంకటరెడ్డిని హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నియమించడం పట్ల పట్టణ ప్రముఖులు, స్థానికులు, నాటి వెంకటరెడ్డి సహచరమిత్రులు పలువురు శనివారం హర్షం వ్యక్తం చేశారు.

చింతకాని: హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదులుగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన 19 మంది జాబితాలో చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన కూరపాటి వెంకటేశ్వర్లు, భద్రమ్మ కుమార్తె కూరపాటి సుజాత ఉన్నారు. మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన సుజాత ఉస్మానియ అనుబంధ లా కళాశాలలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1996 నుంచి హైకోర్టులో లాయర్‌గా పనిచేస్తున్నారు. ఆమె సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ న్యాయవాదిగా అవకాశం కల్పించింది. కాగా సుజాత హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఆన్‌లైన్ షాపింగ్‌తో రూ.58 వేలు పోగొట్టుకున్న బాధితురాలు

కల్లూరు, జూలై 13: ఆన్‌లైన్‌లో షాపింగ్ పేరుతో కల్లూరుకు చెందిన ఓ బాధితురాలి ఖాతా నుంచి శుక్రవారం సైబర్ నేరస్తులు నగదు స్వాహా చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఓ సైబర్ నేరస్తుడు షైనేత్ర మొబైల్ యాప్ ద్వారా ఆన్లైన్ షాపింగ్ చేసే ఒక ప్రోడక్ట్ ఆర్డర్ బాధిత మహిళ మొబైల్ నెంబర్‌కు ఫోన్ చేస్తూ, మీరు పెట్టుకున్న ఆర్డర్‌కి అడ్రస్ అప్డేట్ గురించి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఒక లింక్ పంపించాడు. ఆ లింక్‌కు రూ.2 పంపించడి అని చెప్పగా, బాధిత మహిళ తన ఫోన్ పే అకౌంట్ నుంచి రూ.2 పంపించింది. మరుసటి రోజున తన బ్యాంకు ఖాతా నుంచి రూ.58,425 బదిలీ అయ్యాయని ఫోన్‌కు సమాచారం వచ్చింది. దీంతో తాను మోసపోయానని గ్రహిం చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సైబర్‌క్రైంగా భావించి శనివారం కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

లక్ష్మీనగరంలో మరోవ్యక్తి..

దుమ్ముగూడెం జూలై 13:మండల పరిధిలోని లక్ష్మీనగరానికి చెందిన గుడ్ల ప్రసాద్‌రెడ్డి శనివారం సైబర్ వలకు చిక్కి సుమారు రూ.12వేల నగదును కోల్పోయాడు. మొబైల్ ఫోన్‌లో రూ.లక్ష రుణం ఇస్తామనే ప్రకటన చూసి, వాళ్లకు తన ఆధార్, బ్యాంకు ఖాతా, పాన్ వివరాలు అందించాడు. రుణం మంజూరు కావాలంటే డబ్బులు పంపాలని కోరగా, రెండు దఫాలుగా రూ.4,750లు, రూ.4,472లు పంపాడు. మరోమారు రూ.10వేలు పంపాలని కోరగా, డబ్బులు అప్పు చేసేందుకు తిరుగుతున్న క్రమంలో ఇదంతా బోగస్ అని తెలుసుకున్నాడు. ఈ లోగా ప్రసాద్‌రెడ్డి బ్యాంకు ఖాతా నుంచి రూ.2,900లు మాయమయ్యాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించడంతో పాటు సైబర్‌క్రైం టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

భద్రాద్రి జిల్లాలో 18 మంది ఎస్‌ఐల బదిలీలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై13: భద్రాద్రి జిల్లాలో 18 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు శనివారం ఉత్తర్వులను విడుదల చేశారు. బదిలీ అయిన వారిలో

వీఆర్ భద్రాద్రిలో ఉన్న ఎస్‌డి షాహీనాను కొత్తగూడెం టూటౌన్‌కు, కొత్తగూడెం టూటౌన్ ఎస్‌ఐగా ఉన్న రాజేష్‌ను బూర్గంపాడు ఎస్‌హెచ్‌వోగా, బూర్గంపాడు ఎస్‌హెచ్‌వోగా ఉన్న కె.సుమన్‌ను భద్రాద్రి సీసీఎస్-2గా, భద్రాద్రి సీసీఎస్-2గా ఉన్న రాజుకుమార్‌ను ఏడూళ్ల బయ్యారం ఎస్‌హెచ్‌వోగా, ఏడూళ్ల బయ్యారం ఎస్‌హెచ్‌వోగా ఉన్న టి.వెంకటప్పయ్యను దుమ్ముగూడెం ఎస్‌ఐగా, దుమ్ముగూడెం ఎస్‌ఐగా ఉన్న పి.కేశవరావును వీఆర్ భద్రాద్రికి, ములకలపల్లి ఎస్‌హెచ్‌వోగా ఉన్న ఎం.రాజమౌళిని గుండాల ఎస్‌హెచ్‌వోగా, గుండాల ఎస్‌హెచ్‌వోగా ఉన్న కె.రాజశేఖర్‌ను ములకలపల్లి ఎస్‌హెచ్‌వోగా, వీఆర్ భద్రాద్రిలో ఉన్న బి.రాణాప్రతాప్‌ను జూలూరుపాడు ఎస్‌హెచ్‌వోగా, జూలూరుపాడు ఎస్‌హెచ్‌వోగా ఉన్న ఐ.జీవన్‌రాజును వి.ఆర్ భద్రాద్రికు, వీఆర్ భద్రాద్రిలో ఉన్న నాగూల్‌మీరాఖాన్‌ను ఇల్లెందు ఎస్‌ఐగా, ఇల్లెందు ఎస్‌ఐగా ఉన్న జి.విజయలక్ష్మిని భద్రాచలం టౌన్ ఎస్‌ఐగా, భద్రాచలం టౌన్ ఎస్‌ఐగా ఉన్న జి.విజయను కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్‌ఐగా, వీఆర్ భద్రాద్రిలో ఉన్న బి.రంజితను మణుగూరు ఎస్‌ఐ-2గా, టేకులపల్లి ఎస్‌హెచ్‌వోగా ఉన్న ఎస్‌కె. సైదారావుఫ్ వీఆర్ భద్రాద్రికు, ఖమ్మం కమిషనరేట్‌లో ఉన్న పి.సురేష్‌ను టేకులపల్లి ఎస్‌హెచ్‌వోగా, వీఆర్ భద్రాద్రిలో ఉన్న గంజి స్వప్నను చంద్రుగొండ ఎస్‌హెచ్‌వోగా, చంద్రుగొండ ఎస్‌హెచ్‌వోగా ఉన్న ఎం. రవిని వీఆర్ భద్రాద్రికి బదిలీలు అయ్యారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కల్లూరు, జూలై 13 మండలంలోని రఘునాథబంజర గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. రఘునాథబంజర గ్రామంలో ఎస్‌కే మస్తాన్ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు అందిన సమాచారంతో జిల్లా సివిల్ సప్లై అధికారి చందన్‌కుమార్, డిటీ సత్యనారాయణలు అతడి ఇంట్లో తనిఖీలు చేపట్టగా 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. దీంతో బాధ్యుడైన మస్తాన్‌పై 6 ఏ కేసు నమోదు చేసి, సదరు బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నారు.

పలు గ్రామాల్లో రేషన్ దుకాణాల తనిఖీ

పెనుబల్లి, జూలై 13: పౌరసరఫరాలశాఖ అధికారులు శనివారం పెనుబల్లి మండలంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. శనివారం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి చందన్‌కుమార్, సివిల్‌సప్లయి డీటీ సత్యనారాయణలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేషన్‌షాపులు, అక్రమ బియ్యం వ్యాపారులు, కోళ్లఫారాలను తనిఖీ చేశారు. శనివారం అధికారులు టేకులపల్లి, గౌరారం(ఉప్పలచలక) గ్రామాల్లోని రేషన్‌షాపులతోపాటు ఆంధ్రాకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలించే వ్యాపారుల ఇళ్లను, కోళ్లఫారాలను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. అధికారులు వస్తున్నట్లు ముందుగానే వ్యాపారులకు సమాచారం రావడంతో సదరు వ్యాపారులు రేషన్‌బియ్యాన్ని వేరే ప్రాంతానికి తరలించారని, కొందరు ఇళ్లకు తాళాలు వేసి ఇళ్లల్లో లేకుండా వెళ్లిపోయారని కూడా ప్రచారం జరుగుతుంది. ఆశాఖ అధికారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి జిల్లా అధికారులు తనిఖీలు చేపడితేనే అక్రమ వ్యాపారులు పట్టుబడతారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదిఏమైనా శనివారం ఒక్కచోట కూడా అధికారులు పీడీఎస్ బియ్యాన్ని పట్టుకోకపోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని దీక్ష

ఆళ్లపల్లి, జూలై 13: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం 108 రోజులు ఫలదీక్ష చేస్తున్న జాకారం పాఠశాల ఉపాధ్యాయుడు మహమ్మద్ పాషాకి శనివారం ఆళ్లపల్లి మండల ప్రెస్ కమిటీ మర్కోడు అయ్యప్ప బృందం, ఆళ్లపల్లి జామామసీద్ కమిటీ సభ్యులు, మద్దతు తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పాత పెన్షన్ స్కీం, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీలో ఓటుహక్కుతో పాటు అనేక సమస్యల పరిష్కారం కోసం దీక్ష చేస్తున్నట్లు ఉపాధ్యాయు డు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ కమిటీ అధ్యక్షుడు ఫయిమ్, సభ్యులు శేఖర్, శ్రావణ్, ఖలీల్, యోగి, కోటేష్, సతీష్, అయ్యప్ప బృందం రణం మల్లికార్జున్, పోదిలరాము, సుబ్బరావు, నవజీవన్, ఆళ్లపల్లి మసీద్ కమిటి సభ్యులు, హఫీజ్, అతహర్, ఖాలీద్, నయిమ్, ఖయ్యాం, తదితరులు పాల్గొన్నారు.



మద్దతు తెలుపుతున్న అయ్యప్ప బృందం

నేషనల్ యూత్‌గేమ్స్ చాంపియన్ షిప్‌కు ఎంపికైన సాయికృష్ణ



ముదిగొండ, జూలై 13: ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వాకదాని కన్న య్య కుమారుడు సాయికృష్ణ నేషనల్ యూత్‌స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ ఫెడరేషన్(ఇండియా)18వ నేషనల్ యూత్ గేమ్స్ చాంపియన్ షిప్-2024 స్టేట్ లెవల్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. గోవాలో శనివారం నుంచి ఈనెల 15వతేదీ వరకు జరగనున్న పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా సాయికృష్ణను గ్రామస్థులు అభినందించారు.

ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు డిప్యూటేషన్ రద్దు

● కొత్తగూడెం మెడికల్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా రాజ్‌కుమార్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై13: హైదారాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆర్.ఎల్. లక్ష్మణ్‌రావు డిప్యూటేషన్ పై కొత్తగూడెం ఇన్‌చార్జి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. శనివారం డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ఆదేశాల ప్రకారం లక్ష్మణ్‌రావును తిరిగి ప్రొఫెసర్‌గానే కొనసాగించాలని ఉత్తర్వులను విడుదల చేశారు.

ఈ క్రమంలో కొత్తగూ డెం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న లక్ష్మణ్ రావు ఉస్మానియా మెడికల్ కళాశాలకు ప్రొఫెసర్‌గా తిరిగి వెళ్లిపోయారు. దీంతో అదే కళాశాలలో పైథాలజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్‌గా డీఎంఈ నియమించింది.

ఆటోలో పోగొట్టుకున్న మొబైల్ అందజేత

ఖమ్మంక్రైం, జూలై13: ఖమ్మంరూరల్ మండలం శ్రీసిటీ ప్రాంతానికి చెందిన శిరీష అనే యువతి శనివారం ఆమె నివాసం ఉంటున్న ప్రాంతం వద్ద నుంచి ఖమ్మానికి ఆటోలో వస్తుంది. పాతబస్టాండ్ వద్ద ఆటో దిగుతూ పొరపాటున తన మొబైల్‌ను ఆటోలో మరిచిపోయింది దీంతో బాధితురాలు ట్రాఫిక్ పోలీసులను సంప్రదించింది. పోలీసులు సీసీ కెమెరా ద్వారా ఆటో నెంబర్ గుర్తించి, డ్రైవర్‌కు ఫోన్ చేసి విషయం వివరించారు. దీంతో ఫోన్ ఆటోలో ఉందని, సదరు ఆటో డ్రైవర్ పోలీసులకు సమాచారం అందించాడు. అనంతరం ఆటోడ్రైవర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ వద్దకు వచ్చి బాధితురాలికి మొబైల్‌ను అందించారు. దీంతో సదరు యువతి ట్రాఫిక్ పోలీసులకు, ఆటో డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

కుల, మత వ్యవస్థ..సమాజానికి పట్టిన చీడ

● సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంచందర్



సమావేశంలో పాల్గొన్న పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్, నాయకులు

మధిర, జూలై 13: కుల, మత వ్యవస్థ సమాజానికి పట్టిన చీడలాంటివని, కుల, మతాలు లేని సమసమాజం కోసం యువత పాటుపడాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేజీ రాంచందర్ పిలుపు నిచ్చారు. మధిరలోని శ్రీవాసవీ ఆర్యవైశ్యకళ్యాణ మండపంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న పీవైఎల్ రాజకీయ శిక్షణ తరగతుల్లో శనివారం పాల్గొని మాట్లాడారు. ఏ దేశంలోలేని కుల వ్యవస్థ భారతదేశ ప్రత్యేక లక్షణమైందన్నారు. కులం, మతం పేరుతో దేశంలో నిత్యం అణగారిన వర్గాలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజానికి పట్టిన ఈ చీడలను యువతరమే రూపుమాపాలని అందరూ యువత నడుం బిగించి పాటుపడాలని సూచించారు. అనంతరం జరిగిన సెమినార్‌లో కులం-మతం అనే అంశంపై పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులనుద్దేశించి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ శిక్షణ తరగతుల్లో పీవైఎల్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం. హన్మేష్ మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానం జీవన విధానంలో భాగం కావాలన్నారు. ఏపీవీకే ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశం అంటే మట్టి అని, మతం కాదన్నారు. మతాన్ని చూపించి పార్టీలు ప్రజల మధ్య విభజన రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.అజయ్ అమరవీరుల సంతాపాన్ని ప్రవేశపెట్టగా రెండు నిమిషాలు సభ్యులు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి పీవై పుల్లయ్య, సీపీఐ ఎంఎల్ మధిర డివిజన్ కార్యదర్శి కంకణాల అర్జున్‌రావు, పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్, సహాయ కార్యదర్శి రాకేష్, కోశాధికారి వాసం బుచ్చిరాజు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ సింగ్, రాష్ట్ర కమిటీ సభ్యులు భరత్, మంద సురేష్, కురుసా రామకృష్ణ, గణేష్, భూషణవేటి కృష్ణ, అనీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగం పోయిందని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య



విజయ్‌కుమార్(ఫైల్)

చింతకాని, జూలై 13: ఉద్యోగం పోయిందని ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న నల్లమోతు విజయ్‌కుమార్(25)ను మూడు నెలల క్రితం కంపెనీవారు ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పటి నుంచి నాగులవంచలోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో పలు సంస్థల్లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేశాడు. అయితే శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదే రోజు రాత్రి గాంధీనగర్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వేట్రాక్ సిబ్బంది శనివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైలు ఢీకొనడంతో మృతదేహం ఛిద్రమైంది. అన్నం సేవా సమితి బాధ్యుడు అన్నం శ్రీనివాస్‌రావు బృందం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి నల్లమోతు మోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



లక్ష్మణ్(ఫైల్)

బోనకల్, జులై 13: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన బోనకల్ గ్రామం లో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మరీదు లక్ష్మణ్(43) బోనకల్ గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్నా డు. శనివారం సెలవు దినం కావడంతో చేపల వేటకు వెళ్లాడు. రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న కుంటలోకి వలతో దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగాడు. గమనించిన కొందరు అతడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దమ్మపేట, జూలై 13: పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసిన ఘటన ముష్టిబండ గ్రామంలో శనివారం జరిగింది. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముష్టిబండ గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,820లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అశ్వారావుపేటలో చోరీ

● రూ.65వేల నగదు, బంగారం అపహరణ



వస్తువులు చిందరవందరగా పడి ఉన్న దృశ్యం

అశ్వారావుపేట, జూలై 13: అశ్వారావుపేట పట్టణం శివయ్యగారి బజారులోని ఓ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన తిరుమలశెట్టి గోపి కుటుంబం నాలుగురోజుల క్రితం ఇంటికి తాళం వేసి తిరుపతి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి తిరిగివచ్చారు. వీరు ఇంట్లోకి వెళ్లేసరికి, వెనుక తలుపు తెరిచి ఉండడంతో పాటు, బీరువాలో ఉన్న సామాగ్రి అంతా చిందర వందరగా పడి ఉండటాన్ని గమనించారు. బీరువాలో ఉన్న రూ.65వేల నగదు, అరుకాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అశ్వారావుపేట ఎస్‌ఐ-2 శివరామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పినపాక కోదండ రామాలయంలో....

తల్లాడ, జూలై 13: తల్లాడ మండలం పినపాక గ్రామంలోని కోదండరామాలయంలో చోరీ జరిగిన సంఘటన ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం కోదండ రామాలయంలోని అంజనేయస్వామి వెండి కిరీటం, నాలుగు రాగి, ఇత్తడి చెంబులను గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు. స్కూటీపై ముగ్గురు యువతులు, ఓ యువకుడు కలిసి చోరీకి పాల్పడినట్లు గుర్తించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్వనేని లక్ష్మణ్‌రావు తెలిపారు. చోరీకి పాల్పడిన అనంతరం స్కూటీపై వెళ్తున్న వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా, పరారైనట్లు ఆయన తెలిపారు.

సాధారణ ప్రసవం కోసం వెళ్తే..

- వైద్యం అందక ఆడశిశువు మృతి
- అస్వస్థతకు గురైన తల్లి
- పీహెచ్‌సీ వద్ద బంధువుల ఆందోళన



పీహెచ్‌సీలో ఆందోళన చేస్తున్న బంధువులు

తల్లాడ, జూలై 13: సాధారణ ప్రసవం కోసమని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తే, సకాలంలో సరైన వైద్యం అందక ఆడశిశువు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి తల్లాడలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన గర్భిణీ దడిపల్లి లావణ్యకు మొదటి కాన్పు సాధారణ ప్రసవం కావడంతో, రెండో కాన్పు కూడా సాధారణ ప్రసవం కోసమని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరవల్సిందిగా ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు సూచించారు. దీంతో కాన్పు కోసం శుక్రవారం ఉదయం ఆమె పీహెచ్‌సీలో చేరింది. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పురిటినొప్పులు రావడంతో ఈ విషయాన్ని స్టాఫ్‌నర్సు కళావతికి లావణ్య భర్త అశోక్ చెప్పాడు. పురిటినొప్పులు మరో రెండు గంటల పాటు రావాల్సి ఉంటుందని కళావతి అశోక్‌కు సమాధానమిచ్చింది. కాగా స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రత్నమనోహర్ సెలవులో ఉండడంతో పీహెచ్‌సీ ఇన్‌చార్జిగా ఉన్న అన్నారుగూడెం పల్లె దవాఖానా డాక్టర్ వై.గోపి పీహెచ్‌సీకి వచ్చారు. పురిటినొప్పులతో బాధపడుతున్న లావణ్యను డాక్టర్ గోపి పరీక్షించిన అనంతరం సిబ్బందితో కలిసి డెలివరీ చేసేందుకు ప్రయత్నించారు. కాగా వైద్యులు డెలివరీ చేస్తుండగానే శిశువు మృతి చెందింది. దీంతో లావణ్య అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే బంధువులు ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. డాక్టర్, స్టాఫ్‌నర్సు నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిందని, తల్లి అస్వస్థతకు గురైందని బంధువులు ఆందోళన చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవం చేయించుకోవాలని ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు వత్తిడి చేయడం వల్ల కాన్పు కోసం లావణ్యను పీహెచ్‌సీకి తీసుకువచ్చామని బాధితుడు అశోక్ అన్నారు. సకాలంలో సరైన వైద్యం అందక డాక్టర్, స్టాఫ్‌నర్సు నిర్లక్ష్యం వల్ల శిశువు మృతి చెందినట్లు వాపోయాడు.

ఇదిలా ఉండగా శనివారం పీహెచ్‌సీ సిబ్బంది లావణ్య దంపతులతో చర్చలు జరిపారు. చికిత్స పొందుతున్న లావణ్య వైద్యఖర్చులు భరించడంతో పాటు నష్ట పరిహారం ఇచ్చేందుకు అంగీకరించడంతో ఆందోళన సద్దుమణిగింది. ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్ తెలిపారు. ప్రొటోకాల్‌ను ఉల్లంఘించి స్టాఫ్‌నర్సు కళావతి కుమారుడు తమ సీటులో కూర్చోవడం పట్ల ఆయన అభ్యంతరం తెలిపారు.

హోటల్ యజమానిపై 6 ఏ కేసు



గ్యాస్ సిలిండర్లను స్వాధీన పరుచుకుంటున్న అధికారులు

కల్లూరు, జూలై 13 కల్లూరులోని ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు వద్ద ఓ హోటల్‌లో గృహ అవసరాలకు వినియోగిస్తున్న సిలిండర్లను పట్టుకోని యాజమానిపై 6 ఏ కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి సివిల్ సప్లై డిటి సత్యనారాయణ తెలిపారు. శనివారం ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు వద్ద గల రాధమ్మ హోటల్‌లో సదరు యజమానులు వ్యాపారమునకు సంబంధించి కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు వాడాల్సి ఉండగా గృహ అవసరాల నిమిత్తం వాడే సిలిండర్లు వాడటంతో సమాచారం అందుకుని దాడి చేశామని ఆయన తెలిపారు, ఇలా హోటల్‌లో గృహ అవసరాలకు వినియోగించే 6 సిలిండర్లను పట్టుకోవటం జరిగిందన్నారు. గృహ అవసరాలకు సంబంధించిన గ్యాస్ సిలిండర్లు వాడినట్లయితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని, 6 ఏ కేసు నమోదు చేస్తామని వివరించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

బూర్గంపాడు, జూలై 13: యువకుడు అదృశ్యమైన ఘటనలో బూర్గంపాడు పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన ప్రశాంత్ రెడ్డి ఈ నెల 1న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. ప్రశాంత్ తండ్రి పిచ్చిరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాగి వైర్ చోరీ

పెనుబల్లి, జూలై 13: మండలంలోని భవన్నపాలెం గ్రామ సమీపంలో రైతులు అమర్చుకున్న మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులో ఉన్న రాగి వైర్‌ని చోరీ చేసిన సంఘటన శనివారం జరిగింది. ఏఈ రవితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుబల్లి, జూలై 13: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం హైదరాబాద్ ఆసుపత్రిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరు మండలం రఘునాథబంజర గ్రామానికి చెందిన మట్టా రాఘవులు(50) తన స్కూటీపై శుక్రవారం తాళ్లపెంట గ్రామానికి వచ్చి ఇంటికి తిరిగి వె ళ్తుండగా, టేకులపల్లి హైవే రోడ్డు ఎక్కుతుండగా సత్తుపల్లి వైపు నుంచి కల్లూరు వైపు వెళ్తున్న కంటెయినర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా అతడిని మొదట పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షకులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవాసమితి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో 2024- 25 సంవత్సరానికి గాను సింగరేణి ఉద్యోగుల భార్యలకు, పిల్లలకు పరిసర ప్రాంతాల నిరుద్యోగ మహిళలకు నిర్వహించే వివిధ వృత్తి శిక్షణ 3 నెలల కాలపరిమితి కోసం శిక్షణ ఇచ్చేందుకు అనుభవం, అర్హత కలిగిన శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీఎం (పర్సనల్) వెల్ఫేర్ ఆర్‌సీపీ సామ్యూల్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయం - హైదరాబాద్ వారిచే సర్టిఫికెట్లు కూడా అందచేయబడుతుందని తెలిపారు. దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవడం మాత్రం బ్యాచ్‌కి ఉన్న పరిమితులకు లోబడి ఉంటుందని, ఒక వేళ బ్యాచ్ నిర్ధేశిత సంఖ్య కన్న ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లైతే బ్యాచ్ పరిమితి ప్రకారం ఎంత మందికి శిక్షణ ఇవ్వగలరో అంతమందికి మాత్రమే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు.

ఏజెన్సీ ప్రాంత ఉద్యోగులు గిరిజనులై ఉండాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్

నవభారత్, కేటీపీఎస్ కర్మాగారాల్లో ప్రత్యేక సమావేశం


పాల్వంచలో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

పాల్వంచ, జూలై 13: ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు తప్పనిసరిగా గిరిజనులై ఉండాలని, సంస్థ యజమానులు అధిక ప్రాధాన్యత గిరిజనులకు ఇచ్చి వారి కుటుంబాలకు ఆసరా కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శనివారం పాల్వంచలోని కేటీపీఎస్, నవభారత్ కర్మాగారాల్లో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవభారత్, కేటీపీఎస్ కర్మాగారాల్లో పని చేసే సిబ్బంది తెలంగాణ వారై ఉండి అందులో ఎక్కువశాతం గిరిజనులకే అవకాశం కల్పించాలని, వారు పని చేసే చోట యాజమాన్యాలు సక్రమంగా వేతనాలు, సరైన సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఇరు కర్మాగారాల నిర్మాణ సమయంలో నష్టపోయిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఏజెన్సీ చట్టం ప్రకారం గిరిజన గ్రామాల్లో ప్రతి గిరిజన కుటుంబాలకు ఉద్యోగాల పరంగా అవకాశం ఇచ్చే విధంగా కృషి చేస్తానని, కేటీపీఎస్, నవభారత్ కర్మాగారాల వలన ఎక్కువగా నష్టపోయింది గిరిజనులేనని, వారిని తప్పనిసరిగా అయా కర్మాగారాల్లో నియమించేందుకు చర్యలు చేపడతానని అన్నారు. అనంతరం గిరిజన ఉద్యోగుల సంఘ భవనంలో సంస్థ ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ జీఎం శంకర్రావు, నవభారత్ సంస్థ సీఎండీ శరత్‌బాబు, జీఎం రాజేశ్వరరావు, కేటీపీఎస్ సీఈ ప్రభాకరరావు, కేటీపీఎస్ అధికారులు, ఆర్డీఓ మధుసూధనరావు, తహశీల్దార్ వివేక్, డీఎస్‌వో ప్రభాకరరావు, నరసింహారావు, వివిధ యూనియన్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడులో..

బూర్గంపహాడ్: గిరిజన గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే ఉద్యోగులు తప్పని సరిగా గిరిజనులై ఉండాలని ఆ సంస్థలు అధిక ప్రాధాన్యత గిరిజనులకు ఇచ్చి వారి కుటుంబాలను పోషించుకునే విధంగా వెసులు బాటు కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శనివారం బీపీఎల్ గెస్టుహౌస్‌లో ఐటీసీ కార్మికులు సమస్యల గురించి యూనియన్ ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సరైన వేతనాలు, సదుపాయాలు గిరిజనులకు కల్పించాలని, చిన్న, పెద్ద క్యాడ్ తారతమ్యాలు లేకుండా సమానంగా సదుపాయాలను అందించాలన్నారు. వారు పని చేసే చోట యాజమాన్యాలు సక్రమంగా వేతనాలు, సరైన సదుపాయాలు కల్పించాలని అన్నారు. బీపీఎల్ నిర్మాణ విషయంలో ఎంతో మందికి జీవనాధారం కల్పించడం సంతోషకరమైన విషయమైనప్పటికీ పనిచేసే వారి దగ్గర నుంచి అధికారుల వరకు గిరిజనులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం యూనియన్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతిభ చదువును బట్టి మూడేళ్లకు ఓ సారి పదోన్నతులు, బదిలీలు తప్పని సరిగా చేపట్టాలన్నారు.

ఏజెన్సీ చట్టం ప్రకారం గిరిజన గ్రామాల్లో ప్రతి గిరిజన కుటుంబాలకు ఉద్యోగాల పరంగా అవకాశం ఇచ్చే విధంగా కృషి చేస్తానని,అనంతరం యూనియన్ ప్రతినిధులు జాటోత్ హుస్సేన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రైకార్ జీఎం శంకర్‌రావు, ఆర్డీవో దామోదర్ రావు, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న.. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఐవైఆర్ కృష్ణారావు

రామయ్య కల్యాణంలో పాల్గొన్న 75 జంటలు


జ్ఞాపికను అందజేస్తున్న ఈవో రమాదేవి

భద్రాచలం, జూలై 13: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారిని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమయంలో ఆలయ ప్రాశస్త్యంను వైదిక సిబ్బంది వివరించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. దేవస్థానం తరపున జ్ఞాపిక, శాలువ, స్వామి వారి ప్రసాదంను జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌కు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి అందజేశారు. అలాగే ఏపీ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు కుటుంబ సభ్యులు భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. ఈ సమయంలో ఆలయంలో వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఇదిలా ఉండగా భద్రాద్రి రామయ్యకు శనివారం నిర్వహించిన నిత్యకల్యాణంలో 75 జంటలు పాల్గొన్నాయి. ఉదయం వర్షం కారణంగా బేడా మండపంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు.


రామాలయంలో ఐవైఆర్ కృష్ణారావు

ఈపీ ఆపరేటర్ల ఖాళీలను భర్తీ చేయాలి


ఎస్‌వో టు జీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆపరేటర్లు

మణుగూరు, జూలై 13: సింగరేణి కాలరీస్ కొత్తగూడెం రీజియన్ స్థాయిలో బీ గ్రేడ్ ఈపీ ఆపరేటర్ల ఖాళీలను భర్తీ చేయాలని శనివారం ఆపరేటర్లు ఏరియా ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆపరేటర్ల సంఘం నాయకులు నాసర్ పాషా మాట్లాడుతూ.. పదోన్నతుల విషయంలో యాజమాన్యం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. దీంతో ఆపరేటర్ల ఆర్థికంగా తీవ్ర స్థాయిలో నష్టపోతున్నారని తెలిపారు. కుంటు సాకులు చెబుతూ కాలం వెల్లదీయడం అధికారులకు సరికాదన్నారు.

'సీతారామ'పై స్వార్థపూరిత ఆలోచనలు


సమావేశంలో పాల్గొన్న రైతుసంఘాల నేతలు

ఇల్లెందు టౌన్, జూలై 13: గోదావరి నదిపై నిర్మించే దుమ్ముగూడెం సీతారామ ప్రాజెక్టుపై పాలకులు స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నారని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఏపూరి బ్రహ్మం, సీపీఎం జిల్లా నాయకులు నబీ, న్యూడెమోక్రసీ చంద్రన్నవర్గం జిల్లా నాయకులు రాంసింగ్ ఆరోపించారు. శనివారం ప్రజాపంథా ఎల్లన్నభవనంలో రైతు సంఘాల సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు డిజైన్ మార్చాలని డిమాండ్ చేశారు. మొదట రూపొందించిన విధంగా ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి జలాలను మళ్లించాలని కోరారు. రోళ్లపాడు చెరువు వద్ద అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ప్రాజెక్టు శంఖుస్థాపన చేశారని వివరించారు. కానీ పాలకులు స్వార్థపూరితమైన ఆలోచనలతో ప్రాజెక్టు డిజైన్లను మార్పులు, చేర్పులు చేస్తూ ఏజెన్సీ ప్రాంతానికి చుక్కనీరు రాకుండా చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న డిజైన్ వల్ల మొదటి దశలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలో 26మండలాలకు నీరు అందిస్తామని ప్రకటించనప్పటికీ ఆచరణలో 16 ఏజెన్సీ మండలాలను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లెందు నియోజకవర్గానికి నీటిని మళ్లించే విధంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఈ నెల 21న ఇల్లెందులో సదస్సు నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

మరమ్మతులను వెంటనే చేపట్టాలి: కొత్వాల


అధికారులతో మాట్లాడుతున్న కొత్వాల

పాల్వంచ రూరల్, జూలై 13: గ్రామీణ ప్రాంతాల్లో ఈ వర్షాకాలం అంతర్గత రహదారుల మరమ్మతులు వెంటనే చేపట్టాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ కమిటీ సభ్యులు, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని జగన్నాధపురం, సోములగూడెం గ్రామాల మధ్య ఉన్న రహదారులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. గ్రామాల మధ్య ఉన్న అంతర్గత రహదారులు అస్తవ్యస్థంగా ఉన్నాయని చెప్పారు. అధికారులు పూర్తిగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి మరమ్మతులను తక్షణమే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో నారాయణ, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొండ వెంకన్న, యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేత


నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

మణుగూరు, జూలై 13: డోర్నకల్ కు చెందిన బదర్ పాషా కుటుంబ సభ్యులు అశ్వాపురం మండలంలోని ఆరీఫా రోష్ని వృద్ధాశ్రమానికి శనివారం నిత్యావసరాలను పంపిణీ చేయగా వీటిని సింగరే ణి సేవా కార్యదర్శి షేక్ షాకీరా బేగం అంజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో రవూఫ్, షకీల్, అక్బర్, సల్మా, నస్రీన్, బేగం, మెహరాజ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై స్పందించాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరికృష్ణ


మాట్లాడుతున్న హరికృష్ణ

పాల్వంచ టౌన్, జూలై 13: అంగన్‌వాడీ సమస్యలపై జిల్లాలోని ఐదుగురు ఎమ్మెల్యేలు స్పందించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరికృష్ణ డిమాండ్‌చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగుతున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల రిలే నిరాహారదీక్షలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచే విషయం, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం రూ. 18,000లు వేతనం అమలు తదితర సమస్యలపై జిల్లాలోని ఎమ్మెల్యేలు పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. వీరి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐసీడీఎస్ శాఖమంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదేవిధంగా వీరు చేపడుతున్న దీక్షలకు మద్దతు తెలపాలన్నారు. అంగన్‌వాడీలు అనేక సమస్యలతో సహవాసం చేస్తున్నారని అన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. ఇందుకు మార్గం కనగొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా కార్యదర్శి జి.పద్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.విజయశీల, జిల్లా నాయకులు కృష్ణవేణి, లక్ష్మి, ఆర్‌కేఎం.లక్ష్మి, శాంతమ్మ, ఎల్లమ్మ, భాగ్యమ్మ, లక్ష్మి, సాయమ్మ, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


పొంగులేటిని సన్మానిస్తున్న నాయకులు

అశ్వాపురం, జూలై 13: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ మండల నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని జూబ్లీ హిల్స్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కలిశారు. ఈసందర్భంగా మండలంలోని వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్, నెల్లిపాక సింగిల్ విండో ఛైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, నాయకులు రంగయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీఆర్‌వీకేఎస్ నాయకులు

పాల్వంచ: రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని టీఆర్‌వీకేఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర నాయకులు కోడూరి ప్రకాష్, జాన్సన్, చారుగుండ్ల రమేష్ తమ యూనియన్ సభ్యులతో సహా పొంగులేటిని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రంలో విద్యుత్ సంస్థలను ప్రవేటీకరణ దిశగా అడుగులు వేస్తున్నారని మంత్రికి తెలుపగా ఈవిషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ ఉద్యోగుల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. విద్యుత్ సంస్థల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నసమస్యలను వారు వివరించారు. అనంతరం ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆస్తులు కాపాడటంలో సెక్యూరిటీ కీలకం

సింగరేణి సెక్యూరిటీ శిక్షణ అధికారి జాకీర్ హుస్సేన్


సెక్యూరిటీ సిబ్బందితో శిక్షణ అధికారి జాకీర్ హుస్సేన్

కొత్తగూడెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థకు సంబంధించిన ఆస్తులు, స్థలాలు కాపాడటంలో సెక్యూరిటి సిబ్బందిదే కీలకపాత్ర అని ట్రైనింగ్ అధికారి ఎండీ జాకీర్ హుస్సేన్ అన్నారు. ఎస్‌అండ్‌పీసీ ట్రైనింగ్ సెంటరు, కార్పోరేట్‌లో 77వ బ్యాచ్ సెక్యూరిటి గార్డుల పునఃచరణ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటి సిబ్బంది మెరుగైన వృత్తి నైపుణ్యంతో విధులను నిర్వహించేందుకు గాను 2006 సంవత్సరం నుంచి కొత్తగూడెం ప్రధాన కేంద్రంగా ఎస్‌అండ్‌పీసీ ట్రైనింగ్ సెంటరులో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ ద్వార నేర్చుకున్న ఆధునిక విజ్ఞానంతో మెరుగైన వృత్తిని నైపుణ్యంతో విధులు నిర్వహించాలని సూచించారు. విధుల్లో మెరుగైన ఫలితాల సాధనకు విశేషంగా కృషిచేయాలని కోరారు. అనంతరం ఉత్తమ ట్రైనీలుగా ఎంపికైన సయ్యద్ ఆయాజ్, బి. సమ్మయ్య, జయరాజులకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ పాల్గొని వందన సమర్పణ చేశారు.

ముదిరాజ్ మహాసభ పోస్టర్ల ఆవిస్కరణ

భద్రాచలం, జూలై 13: భద్రాచలంలో శనివారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ పోస్టర్లను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మలానందం, పాండవుల చిన్నారావు, చుక్కా మాధవరావు పాల్గొన్నారు.

ఎస్ఐ రాణా ప్రతాప్ బాధ్యతల స్వీకరణ



జూలూరుపాడు, జూలై 13: జూలూరుపాడు ఎస్ఐగా బాణోత్ రాణా ప్రతాప్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఐ. జీవన్ రాజు కొత్తగూడెం వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్తగూడెం వీఆర్‌లో విధులు నిర్వహిస్తున్న రాణా ప్రతాప్ బదిలీపై జూలూరుపాడుకు వచ్చారు. నూతన ఎస్ఐకి సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ప్రజలకు ఏమైన సమస్యలు ఉంటే తమకు తెలియచేయాలని ఆయన కోరారు.

జూలూరుపాడులో అధిక వర్షపాతం

కొత్తగూడెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జూలూరుపాడులో అత్యధిక వర్షపాతం నమోదైంది. జూలూరుపాడు మండలంలో 79.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చంద్రుగొండ మండలంలో 23.2మిమీ, మణుగూరులో 28.4 మిమీ, అశ్వాపురంలో 20.4 మిమీ, దుమ్ముగూడెంలో 12.4 మిమీ, చుంచుపల్లిలో 14.6 మిమీ, కొత్తగూడెంలో 20 మిమీ, పాల్వంచలో 35.8 మిమీ, ములకలపల్లిలో 47.8 మిమీ, అశ్వారావుపేటలో 24.8 మిమీ, దమ్మపేటలో 20మిమీ, భద్రాచలంలో 19.8 మిమీ, బూర్గంపాడులో 24. 2 మిమీ, లక్ష్మీదేవిపల్లిలో 12 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కిరాయిలను అభివృద్ధికే కేటాయించాలి

ఇల్లెందు టౌన్, జూలై 13: ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్మించిన మున్సిపల్ భవనాల ఆదాయాన్ని పాఠశాలల అభివృద్ధికే కేటాయించాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పీడీఎస్‌యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్ గౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భయ్యా అభిమన్యు, పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి గణేష్ మాట్లాడుతూ మెయిన్ రోడ్డు ప్రభుత్వ పాఠ శాల భూమిని మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకుని కాంప్లెక్స్ నిర్మాణం చేశారని వివరించారు. ప్రస్తుతం 40 కాంప్లెక్స్‌ల ద్వారా వస్తున్న ఆదాయాన్ని పాఠశాలకు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో అయా విద్యార్థి సంఘాల నాయ కులు బి.సాయి, అబ్దుల్ గని, ఎస్.సాయి, పవన్‌కుమార్, బాణోత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దత్తత గ్రామంలో వెలగని విద్యుత్ దీపాలు

విషకీటకాల భయంతో తల్లడిల్లుతున్న ప్రజలు



దుమ్ముగూడెం, జూలై 13: మండల విద్యుత్‌శాఖ దత్తత తీసుకున్న గంగోలు గ్రామపంచాయతీ పరిదిలో గత ఇరవై రోజులుగా వీధి దీపాలు వెలగక తీవ్ర అంధకారం నెలకొంది. కొద్ది నెలల క్రితం గంగోలు గ్రామపంచాయతీ కార్యాలయంలో బ్యానరు పెట్టి మరీ పంచాయతీను దత్తత తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ ప్రకటించింది. విద్యుత్ సంబంధిత సమస్యలు ఏవైనా తమకు తెలియపరిస్తే వెంటనే పరిష్కరిస్తామని శాఖ అధికారులు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఐతే నాటి హామీ అటకెక్కగా, సమాచారం ఇచ్చినా సరిపడా సిబ్బంది లేరని చెప్పి విద్యుత్ దీపాల లైను మరమత్తులు చేయడానికి ముందుకు రాకపోవడం గమనార్హం. వానాకాలం దృష్ట్యా రాత్రి వేళల్లో పాములు, విష కీటకాలు సంచరిస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలకు సంబంధించిన విద్యుత్‌లైను మరమత్తులకు గురవడంతో సమస్య తలెత్తిందని గ్రామస్థులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సైతం ఈ విషయమై విద్యుత్‌శాఖకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలుస్తోంది. మరమ్మతులు చేపట్టి వెంటనే వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే విద్యుత్ బిల్లులు సైతం సకాలంలో తీయకపోవడంతో బిల్లుల మోత మోగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఉపాధి హామీ పనులపై రేపు సామాజిక తనిఖీ

మణుగూరు, జూలై 13: ఈనెల 15వ తేదీన మణుగూరు మండల పరిధిలో ఈ ఏడాది జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యాక్రమాన్ని స్త్రీ శక్తి భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీలో 2024 ఏప్రిల్ నెల నుంచి 2024 ఏప్రిల్ నెల వరకు జరిగిన ఉపాధి పనులపై తనిఖీల నివేదికలు ప్రజా వేదిక దావరా వెల్లడించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రజావేదిక ప్రారంభం అవుతుందని తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షులు, ఎంపిటీసీలు పంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కూలీలు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

ఫర్నీచర్ అమ్మబడును
నల్లమద్ది కర్రతో తయారు చేయబడిన ఫర్నీచర్ బుక్‌షాప్స్, మరియు కిరాణా షాపులకు అనువుగా గల ఫర్నీచర్ అమ్మమునకు కలదు. కావలసినవారు సంప్ర.: 97049 76971
AJM-187631

ఇల్లు అమ్మబడును
ఖమ్మం ముస్తఫానగర్ శ్రీరామ్‌నగర్ కాలనీ రోడ్ నెం.9 లో గల ఈస్ట్‌ఫేసింగ్ 311గజాల ఫ్లాట్ 3BHK పూర్తి వాస్తుతో స్వయంగా కట్టించిన ఒరిజినల్ టేకు తలుపులు, కిటికీలు, కబోర్డులు, సోలార్‌ఇన్వెర్టర్ తో ఉన్న ఇల్లు అమ్మబడును. ఆసక్తి గలవారు సంప్రదించండి: 9052267127
AJM-187662

FLOT FOR SALE
కొత్త అపార్ట్‌మెంట్ ఫ్లాట్ అమ్మకానికి ఉంది 1253 sft, 1వ అంతస్తు, ఉత్తర ముఖం, పాత మమత మెడికల్ కాలేజ్, రోటరీ నగర్, మరియు 1600 sft 4వ అంతస్తు, తూర్పు ముఖం, శ్రీ శ్రీసర్కిల్, ఖమ్మం సంప్ర: 8977994636
AJM -110

EDUCATION
BPT - 4 1/2 సం./ B.Sc. MLT 3 సం.లు/ డిప్లొమా ఇన్ MLT, Anesthesia, Radiographic Asst., Med. Imaging, O.T. Tech, Dialysis, CARDIOLOGY - 2 సం.లు కోర్సులు. అర్హత : ఇంటర్ Bi.P.C/Any Group - ASIAN COLLEGE, VIJAYAWADA. 76800 65835, 90636 15623.
AJB-194741

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

స్థలాలు/ఆవిష్కరణ
పుట్టిన రోజు
వివాహ వార్షికోత్సవం
షష్టిపూర్తి
లీగల్ నోటీసులు
శ్రద్ధాంజలి
పదవీవిరమణ
వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
ఖమ్మం : 9985401672
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347